సాక్షి
అనకాపల్లి
శనివారం। 15। ఫిబ్రవరి। 2025



## అలరించిన గాత్ర కచేరీ

సీతంపేట : శ్రీలలితాపీఠంలో శుక్రవారం మ్యూజిక్ స్కూల్ ప్రిన్సిపాల్ జగదాంబ శిష్య బృందం కర్ణాటక గాత్ర కచేరీ చేశారు.



## కనకమ్మకు క్షీరాభిషేక సేవ

డాబాగార్డెన్స్ : విశాఖ బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ విశేషంగా నిర్వహించారు.

## వాతావరణం

అనకాపల్లి: రాగల ఐదు రోజులు ఆకాశం మేఘావృతమై ఉంటుందని ఆర్‌ఏఆర్‌ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గరిష్ట ఉష్ణోగ్రతలు 34 నుంచి 34.7 డిగ్రీల నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు.

## న్యూస్‌రీల్

### ఈనెలాఖరులోగా లైఫ్ సర్టిఫికెట్ సమర్పించాలి

- జిల్లా ఖజానాధికారి లక్ష్మీ సుభాషిణి



నిర్మాణంలో ఉన్న భవనాన్ని పరిశీలిస్తున్న జిల్లా ట్రెజరీ అధికారి లక్ష్మీ సుభాషిణి

నర్సీపట్నం: ప్రభుత్వ పెన్షనర్లందరూ ఈ నెల 28వ తేదీలోగా జీవన ప్రమాణ ధ్రువీకరణ పత్రం (లైఫ్ సర్టిఫికెట్) సమర్పించాలని జిల్లా ఖజానాధికారి వి.లక్ష్మీ సుభాషిణి తెలిపారు. స్థానిక ఉప ఖజానా కార్యాలయాన్ని శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. కార్యాలయ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న ఖజానా కార్యాలయాన్ని సందర్శించి, బిల్డింగ్ వివరాలను ఎస్టీవో గణేష్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ నూతన భవన నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వ పెన్షనర్లందరూ ఈనెల 28లోగా విధిగా లైఫ్ సర్టిఫికెట్‌ను ఖజానా కార్యాలయంలో సమర్పించాలని, లేని పక్షంలో పెన్షన్ నిలిచిపోతుందన్నారు. ఆరోగ్య సమస్యలతో కదలలేని పరిస్థితిలో ఉన్న పెన్షనర్ల ఇళ్లకు ఖజానా అధికారులు వెళ్లి సర్టిఫికెట్ తీసుకుంటారన్నారు. అలాంటి వారు ఎవరైనా ఉంటే తమ సిబ్బందికి సమాచారం అందించాలని సూచించారు.

### పీఈటీ అసభ్య ప్రవర్తనపై ఫిర్యాదు

- విచారణ జరిపిన ఎంఈవో
- విద్యార్థినులు, తల్లిదండ్రుల నుంచి వివరాల సేకరణ

గొలుగొండ: చోద్యం జెడ్పీ హైస్కూల్లో పార్ట్ టైమ్ పీఈటీగా పనిచేస్తున్న కుందూరి నూకరాజు విద్యార్థుల పట్ల దురుసుగా, అసభ్యకరంగా ప్రవర్తించినట్లు వచ్చిన ఆరోపణలపై ఎంఈవో–1 సత్యనారాయణ శుక్రవారం విచారణ నిర్వహించారు. ఈనెల 1న తమిళనాడు రాష్ట్రంలో జరిగిన లంగిడీ క్రీడలకు చోద్యం హైస్కూల్ నుంచి సుమారు 10 విద్యార్థులు వెళ్లారు. తిరిగి వచ్చే సమయంలో బాలికల పట్ల పీఈటీ అసభ్యకరంగా ప్రవర్తించినట్లు శుక్రవారం స్కూల్ కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు లిఖితపూర్వకంగా ఎంఈవో–1 సత్యనారాయణకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఆయన హైస్కూల్లో విచారణ జరిపి హెచ్‌ఎం శ్రీనివాస్, తల్లిదండ్రులు, విద్యార్థులతో మాట్లాడి ఏం జరిగిందో తెలుసుకున్నారు. అనంతరం సాక్షితో మాట్లాడుతూ.. సోషల్ మీడియాలో శుక్రవారం మధ్యాహ్నం వచ్చిన వార్త ఆధారంగా చోద్యం స్కూల్‌కి వచ్చి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులను విచారించామన్నారు. పీఈటీ నూకరాజు విద్యార్థుల పట్ల దురుసుగా, అసభ్యంగా ప్రవర్తించినట్లు తేలిందన్నారు. డీఈవోకు నివేదిక అందజేయనున్నట్లు తెలిపారు.

### జంపపాలెం రేషన్ దుకాణం తనిఖీ

- డీలర్, ఎండీఎం ఆపరేటర్‌పై చర్యలకు జేసీ ఆదేశం



రేషన్ డీలర్, ఎండీఎం ఆపరేటర్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జేసీ జాహ్నవి

యలమంచిలి రూరల్: మండలంలోని జంపపాలెం రేషన్ దుకాణాన్ని శుక్రవారం జాయింట్ కలెక్టర్ జాహ్నవి, జిల్లా పౌరసరఫరాల అధికారులు తనిఖీ చేశారు. ఇటీవల ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా గ్రామంలో సరఫరా చేసిన బియ్యంలో రాళ్లు, ఎలుకల మలం వంటివి ఉన్నాయని గ్రామ సర్పంచ్ శిలపరశెట్టి సత్య నాగ దేవకి ఫిర్యాదు చేశారు. దుకాణం నిర్వహణ సక్రమంగా జరగడం లేదని, అవకతవకలు చోటు చేసుకుంటున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు జేసీ ఈ రేషన్ దుకాణాన్ని తనిఖీ చేయగా అక్కడ స్టాకు వివరాలతో కూడిన బోర్డు లేకపోవడం, స్టాకులో తేడా ఉండడంతో డీలర్, ఎండీఎం ఆపరేటర్లపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇప్పటికే వారిద్దరికీ అనకాపల్లి ఆర్డీవో షోకాజ్ నోటీసులు జారీచేశారు. శుక్రవారం జేసీ తనిఖీ చేసి ఆగ్రహం వ్యక్తం చేయడంతో జిల్లా అధికారులు కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉంది. జేసీ వెంట డీఎస్‌వో మూర్తి, డీఎం జయంతి, యలమంచిలి తహసీల్దార్ వరహాలు, పౌరసరఫరాల డీటీ నూకరాజు పాల్గొన్నారు.

# కిక్కు దిగింది..



**మందుబాబులకు కూటమి సర్కార్ షాక్**

- మద్యంపై 15 శాతం ధరల పెంపు
- జిల్లాలో మద్యం ప్రియులపై నెలకు రూ.13.5 కోట్ల అదనపు భారం
- అధికారంలోకి వస్తే తక్కువ ధరకే మద్యం ఇస్తామని ప్రగల్భాలు
- మాట తప్పిన కూటమి నేతలపై మండిపడుతున్న మందుబాబులు



సాక్షి, అనకాపల్లి: మందుబాబులకు కూటమి ప్రభుత్వం గట్టి షాక్ ఇచ్చింది. అధికారంలోకి వస్తే తక్కువ ధరకే మద్యం ఇస్తామని ఇచ్చిన హామీని పట్టుమని మూడు నెలలు) కూడా అమలు చేసిన పాపాన పోలేదు. ఏ బ్రాండ్లు అయితే ఎక్కువగా తాగుతున్నారో.. వాటిపైనే 15 శాతం రేట్లు పెంచి మందుబాబుల జేబులకు చిల్లు పెట్టింది. బీర్లు, రూ.99 ధర గల మందు మినహా అన్ని రకాల బ్రాండ్ల రేట్లు పెరిగాయి. కూటమి ప్రభుత్వం వస్తే మద్యం రేట్లు తగ్గుతాయని ఆశ పడిన వారికి భంగపాటు ఎదురైంది. మద్యం ధరలు తగ్గించినట్టే తగ్గించి మూడు నెలల్లోనే పెంచేశారు. ఒక్కో బాటిల్‌పై రూ.10 నుంచి రూ.12 వరకు ధర పెరుగుతోంది. దీంతో జిల్లాలో మందుబాబులపై నెలకు రూ.13.5 కోట్ల అదనపు భారం పడనున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. జిల్లాలో ఎక్సైజ్ శాఖకు సంబంధించి 8 సర్కిల్స్ పరిధిలో 146 మద్యం దుకాణాలు, 10 బార్లు ఉన్నాయి. సాధారణ రోజుల్లో నెలకు సగటున రూ.90 కోట్ల మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. రోజుకు రూ.3 కోట్ల మేర జరిగే అమ్మకాలు పండుగల సమయంలో పెరుగుతాయని అధికారులు వెల్లడిస్తున్నారు. జాతరలు జరిగే నెలల్లో రూ.95 కోట్ల వరకు విక్రయాలు జరుగుతాయి. అనకాపల్లి, నర్సీపట్నం, యలమంచిలి, చోడవరం, పాయకరావుపేట, గొలుగొండ సర్కిల్ పరిధిలో మద్యం ఎక్కువగా సేల్ అవుతుంది.

### దుకాణాలు పెరిగాయి.. సేల్స్ తగ్గాయి

రాష్ట్రంలో ఇండియన్ మేడ్, ఫారిన్ లిక్కర్, బీర్లు...ఇలా మూడు కేటగిరీల్లో మద్యం సరఫరా చేస్తున్నారు. ప్రైవేట్ మద్యం పాలసీ విధానం తీసుకొచ్చిన కూటమి ప్రభుత్వం లాటరీ విధానంలో టెండర్ ప్రక్రియ చేపట్టి మద్యం దుకాణాలను కేటాయించింది. అమ్మకాలపై దుకాణదారులకు 20 శాతం మార్జిన్ ఇస్తామని చెప్పి.. 14 శాతం మార్జినే చేస్తున్నారు. దీంతో దుకాణదారులు అసంతృప్తిగా ఉన్నారు. దుకాణాల సంఖ్య పెరగడంతో సగటున సేల్స్ తగ్గాయంటూ వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి సమయంలో మద్యం ధరలు పెంచడంతో సేల్స్ మరింత తగ్గుతాయంటూ వ్యాపారులు వాపోతున్నారు.

### ధరలు పెరిగిన బ్రాండ్లలో కొన్ని ..

| బ్రాండ్ | పాత ధర (రూ.) | కొత్త ధర (రూ.) | బ్రాండ్ | పాత ధర (రూ.) | కొత్త ధర (రూ.) |
|---|---|---|---|---|---|
| ఇండియన్ గ్రైన్ విస్కీ | 150 | 160 | మేజిక్ మంజీర బ్లూ విస్కీ | 130 | 140 |
| 8 పీఎం ప్రీమియం రిజర్వ్ విస్కీ | 220 | 240 | మార్ఫ్యూస్ బ్రాందీ | 290 | 300 |
| ఏసీ బ్లాక్ క్లాసిక్ విస్కీ | 150 | 160 | ఆఫీసర్స్ ఛాయిస్ | 150 | 160 |
| డార్క్‌బ్లూ డీలక్స్ విస్కీ | 180 | 190 | ఓల్డ్ మంక్ రమ్ | 220 | 230 |
| ఆఫ్టర్ డార్క్ బ్లూ డీలక్స్ విస్కీ | 180 | 190 | రాయల్ ఛాలెంజ్ విస్కీ | 210 | 220 |
| అరిస్ట్రోకాట్ ప్రీమియం విస్కీ | 180 | 190 | ఇంపీరియల్ బ్లూ విస్కీ | 360 | 370 |
| డైరెక్టర్స్ స్పెషల్ గోల్డ్ విస్కీ | 130 | 140 | రాయల్ స్టాగ్ | 230 | 240 |
| హేవార్డ్స్ ఫైన్ విస్కీ | 130 | 140 | మాన్షన్ హౌస్ ఫ్రెంచ్ బ్రాండ్ | 100 | 110 |
| మూమెంట్స్ వోడ్కా | 230 | 240 | మాన్షన్ హౌస్ స్పిరిట్ ఫ్రెంచ్ బ్రాండ్ | 190 | 200 |
| వైట్ హాల్ రేర్ ప్రీమియం బ్రాందీ | 150 | 160 | ----- | | |

### ఈ నెల 11 నుంచే కొత్త ధరలు అమలు



ప్రభుత్వం పెంచిన ధరలు ఈ నెల 11 నుంచే అమల్లోకి వచ్చాయి. అన్ని రకాల బీర్లు, రూ.99 విలువైన మద్యం ధరలు పెరగలేదు. మిగతా బ్రాండ్లపై రూ.10లు పెరిగింది. ప్రభుత్వం పేర్కొన్న ధరలకు అన్ని మద్యం దుకాణాల్లో విక్రయాలు చేస్తున్నారు. అంతకన్నా ఎక్కువగా ఎవరు అమ్మినా వారిపై చర్యలుంటాయి.

– సుధీర్, జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ అధికారి

## దామోదరం సంజీవయ్యకు ఘన నివాళి



దామోదరం సంజీవయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: దామోదరం సంజీవయ్య జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లో దామోదరం సంజీవయ్య జయంతి వేడుకను ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెండో ముఖ్యమంత్రిగా, దేశంలోనే తొలి దళిత ముఖ్యమంత్రిగా దామోదరం సంజీవయ్య పని చేయడం గర్వకారణమన్నారు. అతి పిన్నవయసులో ముఖ్యమంత్రి అయిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. నిరుపేద కుటుంబంలో జన్మించినప్పటికీ పరిస్థితులను ఎదుర్కొని, కష్టపడి చదువుకొని వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకొని ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగారని కొనియాడారు. ప్రతి ఒక్కరూ ఆయన జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని లక్ష్యసాధనకు కృషి చేయాలన్నారు. జేసీ జాహ్నవి, బీసీ సంక్షేమ శాఖ అధికారి కె.రాజేశ్వరి, ప్రత్యేక ఉప కలెక్టర్ సుబ్బలక్ష్మి, కలెక్టరేట్ కార్యాలయ పరిపాలనాధికారి బి.వి.రాణి పాల్గొన్నారు.

**విద్యాశాఖ కార్యాలయంలో..**

అనకాపల్లి టౌన్: స్థానిక జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. సంజీవయ్య చిత్రపటానికి జిల్లా విద్యాశాఖాధికారి జి.అప్పారావునాయుడు, సహాయ సంచాలకురాలు రమాదేవి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేద కుటుంబం నుంచి ఉన్నత స్థాయికి చేరుకున్న సంజీవయ్య రాష్ట్ర అభివృద్ధికి చేసిన సేవలను కొనియాడారు. జిల్లా ఉప విద్యాశాఖ అధికారి పి.అప్పారావు, పర్యవేక్షకులు రామలింగేశ్వరావు, పార్వతి, ఏసీ ఎ.శ్రీధర్‌రెడ్డి, ఏఎస్‌వో వెంకటేశ్వరావు, అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.

# ఇది మనకు ‘పరీక్షా’ కాలం

- అన్ని శాఖలు సమన్వయంతో వ్యవహరించాలి
- టెన్త్, ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి
- కలెక్టర్ విజయ కృష్ణన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: అందరూ సమన్వయంతో వ్యవహరించి.. ఇంటర్, పదో తరగతి పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ విజయ కృష్ణన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పరీక్షల నిర్వహణపై శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరీక్ష కేంద్రాలలో మౌలిక సదుపాయాలన్నీ అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా బస్సులను ఏర్పాటు చేయాలని ప్రజా రవాణాశాఖ అధికారులకు ఆదేశించారు. ఎటువంటి విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలన్నారు. పరీక్ష కేంద్రాలలో తాగునీరు, అవసరమైన మందులు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. జిల్లా ఇంటర్ విద్యాధికారి బి.సుజాత మాట్లాడుతూ.. ఇంటర్ పరీక్షలు 34 సెంటర్లలో మార్చి 3న ప్రారంభమవుతాయని చెప్పారు. దేవరాపల్లి, కె.డి.పేట పరీక్ష కేంద్రాలలో అదనపు భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. డీఈవో అప్పారావునాయుడు మాట్లాడుతూ మార్చి 17 నుంచి 107 కేంద్రాలలో పదో తరగతి పరీక్షలు జరుగుతాయని చెప్పారు. సమస్యాత్మక కేంద్రాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు. డీఎంహెచ్‌వో జి.రవికుమార్, ప్రజా రవాణాశాఖ జిల్లా అధికారి కె.పద్మావతి, డీపీఆర్వో కె.ఇంద్రావతి, గ్రామవార్డు సచివాలయ అధికారి బి.నాగలక్ష్మి, పోలీసు, విద్యుత్, ట్రెజరీ, పంచాయతీ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పల్లె వైద్యానికి డాక్టర్ డుమ్మా

- శివారు గ్రామాలకు వైద్య సేవలు కరువు
- కూటమి సర్కారులో కొరవడిన చిత్తశుద్ధి



వేములపూడి పీహెచ్‌సీ ప్రాంగణంలో ఉన్న 104 వాహనం

నర్సీపట్నం: గ్రామాల్లో పల్లె ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు వీలుగా వైద్య ఆరోగ్యశాఖ ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమానికి కొందరు వైద్యాధికారులు డుమ్మా కొడుతున్నారు. వైద్యసేవలు అందించడంలో కూటమి సర్కారుకు చిత్తశుద్ధి కొరవడిన వైనాన్ని గమనించిన కొందరు నిర్లక్ష్యం వహిస్తున్నారు. నర్సీపట్నం మండలం, వేములపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అమలాపురం పంచాయతీ శివారు లింగాలపాలెం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ శిబిరమే ఇందుకు నిదర్శనం. డాక్టర్ సుమ ఈ శిబిరానికి హాజరు కాలేదు. ఉదయం 9 గంటలకు గ్రామానికి వెళ్లాల్సిన 104 వాహనం 11 గంటలకు చేరుకుంది. డాక్టర్ లేకుండా ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్త మాత్రమే శిబిరంలో వైద్య సేవలు అందించారు. ఒక్క లింగాలపాలెమే కాదు పీహెచ్‌సీకి దూరంగా ఉన్న ఆక్సాయిపేట, నీలిగుంట గ్రామాలకు వైద్యాధికారులు వెళ్లటం లేదు. గ్రామాలకు వైద్యులు రావటం లేదని ఆయా గ్రామాల ప్రజలు మొరపెట్టుకున్న సందర్భాలు ఉన్నాయి. వేములపూడి పీహెచ్‌సీలో డాక్టర్ అనూష, డాక్టర్ సుమ విధులు నిర్వర్తిస్తున్నారు. ఆస్పత్రిలో ఓపీ చూడాల్సిన డాక్టర్ అనూష నిర్ణీత సమయానికి ఆస్పత్రికి చేరుకున్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమానికి వెళ్లాల్సిన డాక్టర్ సుమ విధులకు హాజరు కాలేదు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడడంతో గ్రామీణ ప్రజలకు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందటం లేదు. ఫ్యామిలీ డాక్టర్ విధానంలో ప్రతి గ్రామంలో నెలకు రెండు సార్లు వైద్య శిబిరాలు నిర్వహించి దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులతో పాటు, గర్భిణులకు సేవలందించాల్సి ఉంది. బీపీ, సుగర్ వ్యాధిగ్రస్తులను పరీక్షించి మందులు పంపించాలి. మంచానికి పరిమితమైన రోగుల ఇళ్లకు వైద్యులు వెళ్లి వైద్య సేవలు అందించాల్సి ఉంది. ఇంత ప్రాముఖ్యత కలిగిన కార్యక్రమానికి పీహెచ్‌సీ డాక్టర్ డుమ్మా కొట్టారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి వైద్యాధికారులు గ్రామాలకు వెళ్లి వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని గ్రామీణ ప్రజలు కోరుతున్నారు.

### చర్యలు తీసుకుంటాం

గ్రామీణ వైద్య శిబిరాలకు వైద్యులు విధిగా వెళ్లాలి. వేములపూడి వైద్యాధికారి డాక్టర్ సుమ ముందుగా ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. విధుల్లో ఉన్నారనుకున్నాను. రెండు రోజుల క్రితం జరిగిన జిల్లా స్థాయి సమావేశంలో జిల్లా వైద్యాధికారి హెచ్చరించారు. డాక్టర్ సుమ గైర్హాజరుపై విచారణ జరిపి శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ జి.ప్రశాంతి, ప్రోగ్రాం ఆఫీసర్, నర్సీపట్నం

# నిర్లక్ష్యానికి మూల్యం.. అల్పజీవులకు శాపం

- కశింకోటలో క్రెబ్స్ బయో కెమికల్ పరిశ్రమ మూసివేత
- విజయవాడ వద్ద బయో వ్యర్థాలను వెదజల్లిన ఫలితం
- స్థానికుల ఫిర్యాదుతో పొల్యూషన్ బోర్డు కఠిన నిర్ణయం
- రోడ్డున పడ్డ 300 మంది ఉద్యోగులు, కార్మికుల కుటుంబాలు

**ఎంకి పెళ్లి సుబ్బి చావుకొచ్చిన చందంగా.. ఎవరో చేసిన పొరపాటుకు క్రెబ్స్ బయో కెమికల్ పరిశ్రమ ఉద్యోగులు, కార్మికులు బలి కావలసి వస్తోంది. ప్రమాదకరమైన వ్యర్థాలను శుద్ధి చేయకుండా తరలించి.. కాంట్రాక్టర్ మార్గంమధ్యలో జనావాసాల్లో విడిచిపెట్టడం పరిశ్రమ మూసివేతకు కారణమైంది. నిబంధనలు పాటించని పరిశ్రమను మూసివేయాలని కాలుష్య నియంత్రణ మండలి అధికారులు ఆదేశాలిచ్చారు. ఏపీఈపీడీసీఎల్ అధికారులు పరిశ్రమకు విద్యుత్ నిలిపివేశారు. దీంతో పనులు నిలిచిపోయాయి. పరిశ్రమలో పనిచేస్తున్న సుమారు 300 మంది ఉద్యోగులు, కార్మికులు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడింది.**



మూతపడిన క్రెబ్స్ బయో కెమికల్ పరిశ్రమ

కశింకోట: తేగాడ సమీపంలో కొత్తపల్లి గ్రామ పరిధిలో 2000 సంవత్సరంలో క్రెబ్స్ పరిశ్రమను ప్రారంభించారు. హృద్రోగ వ్యాధి నివారణ ఔషధంలో వినియోగించే ‘సిమ్వా స్టార్ట్ ఇన్ సర్రాషియో పెప్టిడైస్’ మూల పొడిని ఈ సంస్థలో తయారుచేస్తారు. ఈ పరిశ్రమలో రసాయనాల నుంచి వెలువడే వ్యర్థాలను (ఎంప్లెంట్) సిమెంట్ పరిశ్రమలో ముడిసరకుగా శుద్ధి చేసి వినియోగిస్తారు. కృష్ణా జిల్లా జగ్గయ్యపేటలోని ఓ సిమెంట్ పరిశ్రమతో కాంట్రాక్టర్ ఒప్పందం చేసుకొని లారీల్లో ఇక్కడి నుంచి ఎప్పటికప్పుడు తరలిస్తున్నారు. ఈ క్రమంలో ఇటీవల మార్గంమధ్యలో విజయవాడ రూరల్ మండలం జక్కంపూడి గ్రామం వద్ద ఒక లారీ వ్యర్థాలను ఏ కారణంగానో పడవేయడంతో స్థానికులు కాలుష్య నియంత్రణ మండలికి ఫిర్యాదు చేశారు. ఈ ప్రమాదకరమైన వ్యర్థాలు క్రెబ్స్ పరిశ్రమకు చెందినవిగా గుర్తించి నివేదించడంతో అందుకు బాధ్యులుగా చేస్తూ పరిశ్రమ మూసివేతకు రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి కార్యదర్శి శరవణన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులు కాలుష్య నియంత్రణ మండలి నుంచి పరిశ్రమకు తాజాగా పోస్టు ద్వారా చేరాయి. ఏపీఈపీడీసీఎల్ అధికారులకు కూడా కాలుష్య నియంత్రణ మండలి నుంచి ఉత్తర్వులు రావడంతో విద్యుత్ సరఫరాను పూర్తిగా నిలిపివేశారు. పరిశ్రమలో సుమారు 300 మంది ఉద్యోగులు, కార్మికులు పనిచేస్తున్నారు. వారిలో 200 మంది కార్మికులున్నారు. వీరంతా రోజు వారీ కూలీ, పీసు రేటు విధానంలో పనిచేస్తున్నారు. పరిశ్రమ చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చి విధులు నిర్వహిస్తారు. పరిశ్రమ మూత పడటం వల్ల ఉపాధి కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. అలాగే వందమంది వరకు పర్మినెంట్ ఉద్యోగులు వివిధ ప్రాంతాల నుంచి వచ్చి పనిచేస్తున్నారు. వీరు కూడా పరిశ్రమ మళ్లీ ఎప్పుడు తెరుస్తారో, తమ భవిష్యత్ ఎలా ఉంటుందోనని మధనపడుతున్నారు.

### నిబంధనలు పాటించలేదు

క్రెబ్స్ పరిశ్రమలో వ్యర్థాలను ఆన్‌లైన్ ద్వారా కాకుండా ఆఫ్‌లైన్ ద్వారా తరలించారు. ఇది నిబంధనలకు విరుద్ధం. అలాగే స్థానికంగా ఉన్న రామ్‌కో తదితర సిమెంట్ పరిశ్రమలకు సరఫరా చేయాలి. అలా కాకుండా దూరంగా తరలించి విజయవాడ వద్ద బయట విడిచిపెట్టారు. ఇది కూడా నిబంధనలకు వ్యతిరేకం. ఈ విధంగా భవిష్యత్‌లో ఇంకెవరూ చేయకుండా ఉండేందుకు పరిశ్రమ మూసివేతకు ఆదేశాలు జారీ అయ్యాయి.

– పి.వెంకట ముకుందరావు, పర్యావరణ ఇంజనీర్, కాలుష్య నియంత్రణ ప్రాంతీయ బోర్డు, విశాఖపట్నం

### తప్పిదం కాంట్రాక్టర్‌దే అంటున్న యాజమాన్యం

క్రెబ్స్ పరిశ్రమలోని వ్యర్థాలను సిమెంట్ పరిశ్రమలో ముడి సరుకుగా వినియోగించడానికి ఒప్పందం కుదుర్చుకున్న మేరకు కాంట్రాక్టర్ ఎప్పటికప్పుడు లారీల్లో తరలిస్తున్నారని, ఒక లారీలో వ్యర్థాలను కృష్ణా జిల్లా జక్కంపూడి వద్ద విడిచిపెట్టారని, ఇది పూర్తిగా కాంట్రాక్టర్ తప్పిందమని పరిశ్రమ జనరల్ మేనేజర్ ఎస్.కృష్ణమోహన్, హెచ్‌ఆర్ గంటి నరసింహం శుక్రవారం పేర్కొన్నారు. దీనితో పరిశ్రమకు సంబంధం లేదని, పరిశ్రమ యథావిధిగా కొనసాగేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతూ జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్‌ను కలిసి గురువారం వినతి పత్రం అందజేశామన్నారు. పరిశ్రమ తెరచుకునే వరకు లైటింగ్ కోసం, నీటి కోసం సింగిల్ ఫేజ్ విద్యుత్ సరఫరా చేయాలని కోరామన్నారు.

### ఆందోళనగా ఉంది



క్రెబ్స్ పరిశ్రమ ప్రారంభం నుంచి పాతికేళ్లుగా కలాసీగా పనిచేస్తున్నాను. పని ఉంటే రోజుకు రూ.వెయ్యి వరకు ఆదాయం సమకూరుతుంది. గతంలో ఏదైనా కారణం చేత పరిశ్రమ మూతపడితే మూడు, నాలుగు రోజులకే మళ్లీ తెరచుకునేది. ఇప్పుడు ఎక్కువ రోజులు పడుతుందంటున్నారు. మళ్లీ ఎప్పుడు తెరచుకుంటుందో.. ఏమో? అయోమయంగా ఉంది. కుటుంబ జీవనం ఎలా సాగించాలో ఆందోళనగా ఉంది.

– ఎస్.శ్రీనివాసరావు, కలాసీ, గంటవానిపాలెం

## డ్రైవర్లు అంకితభావంతో పనిచేస్తే సురక్షిత ప్రయాణం



ఉత్తమ ఆర్టీసీ డ్రైవర్లతో మనోహర్, పద్మావతి

అనకాపల్లి: డ్రైవర్లు అంకిత భావంతో పని చేస్తే మంచి గుర్తింపుతో పాటు ప్రయాణికుల భద్రత సాధ్యమవుతుందని జిల్లా ప్రాంతీయ రవాణాశాఖ అధికారి జి.మనోహర్, ప్రజా రవాణాశాఖ (ఆర్టీసీ) జిల్లా అధికారి కె.పద్మావతి అన్నారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల ముగింపు కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి డ్రైవర్ ప్రమాదాలను తగ్గించడంలో భాగంగా మాన్యువల్, డిజిటల్ సిగ్నల్స్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని తెలిపారు. ఆర్టీసీ, ప్రైవేట్ డ్రైవర్ల మధ్య ప్రమాదాలను పరిశీలిస్తే ప్రైవేట్ డ్రైవర్లు ప్రమాదాలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. లాంగ్ డ్రైవింగ్ వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని, సమయపాలన పాటించడం వల్ల ప్రమాదాలను నివారించవచ్చన్నారు. అనంతరం అనకాపల్లి, నర్సీపట్నం డిపోల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన డ్రైవర్లను సత్కరించి, మెమెంటోలు, ప్రశంసాపత్రాలు, నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎ.వి. రమణ, అనకాపల్లి డిపో ఇన్‌చార్జి మేనేజర్ రవిచంద్ర, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## హేచరీల తనిఖీ

కొమ్మాది (విశాఖ) : భీమిలి బీచ్ రోడ్డు మంగమారిపేట తిమ్మాపురం ప్రాంతాల్లోని హేచరీలను కోస్టల్ ఆక్వా కల్చర్ అథారిటీ డైరెక్టర్ పి. శంకర్రావు శుక్రవారం తనిఖీ చేశారు. ఆక్వా కల్చర్, ఆక్వా సంబంధిత యూనిట్లలో యాంటీ బయోటిక్స్ వాడకాన్ని ప్రభుత్వ నిషేధించిన దృష్ట్యా టాస్క్‌ఫోర్స్ కమిటీలు ఈ కేంద్రాలను పరిశీలించింది. రొయ్య పిల్లల ఉత్పత్తి కేంద్రాల్లో వాడే మేతలు, ఇతర ఉత్పత్తులన్నీ సీఏఏ ద్వారా ధ్రువీకరించినవి మాత్రమే ఉపయోగించాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపెడా డీడీ ప్రసాద్ నాయక్, డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ అభిప్రియ, మత్స్య శాఖ అధికారి డి.లావణ్య, హేచరీస్ అసోసియేషన్ ప్రతినిధులు పీవీఎన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## విశాఖలో జీబీ సిండ్రోమ్ అలజడి

- ఆరు కేసులు నమోదు
- కేజీహెచ్‌లో ఐదుగురికి, ప్రైవేట్ ఆస్పత్రిలో ఒకరికి చికిత్స
- అందరి ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యుల వెల్లడి
- అప్రమత్తమైన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు

'గులియన్ బారే సిండ్రోమ్' ఇంతవరకూ పరిచయమే లేని ఈ పేరు.. ఇప్పుడు ఆందోళన కలిగిస్తోంది. విశాఖలో వణుకు పుట్టిస్తోంది. నగరంలో ఇప్పటికే ఆరు కేసులు నమోదయ్యాయి. దీంతో వైద్య శాఖ అప్రమత్తమైంది. అసలేంటి ఈ గులియన్ బారే సిండ్రోమ్? కరోనాలా ఇది కూడా అంటు వ్యాధా..? వైద్యులు ఏమంటున్నారు..? తెలుసుకుందాం.

-మహారాణిపేట (విశాఖ)

ఈ వైరస్ పేరు గులియన్ బారే సిండ్రోమ్. దీని బారినపడిన వారికి ఒళ్లంతా తిమ్మిరిగా అనిపించడం, కండరాలు బలహీనంగా మారడం, డయేరియా, పొత్తి కడుపు నొప్పి, జ్వరం, వాంతులు కావడం లాంటి లక్షణాలు ఉంటాయని వైద్యులు చెబుతున్నారు. కలుషిత ఆహారం, నీటి ద్వారా ఈ బ్యాక్టీరియా సోకుతుంది. ఈ వ్యాధి ముఖ్యంగా పిల్లలు, వృద్ధులపైనే తీవ్ర ప్రభావం చూపుతుంది. నాడీ వ్యవస్థను ఈ వైరస్ దెబ్బతీస్తుంది. దీంతో రోగి పక్షవాతం బారిన పడతాడు. అయితే సకాలంలో వైద్యం అందితే ముప్పు ఉండదు. వ్యాధి సోకిన తొలి దశలోనే ఆస్పత్రిలో చేరితే.. 4 వారాల్లో కోలుకునే చాన్స్ ఉంటుంది. వ్యాధి ముదిరితే కోలుకోవడానికి దాదాపు 6 నెలలు పట్టొచ్చు. అత్యధిక శాతం మందిలో ఇన్‌ఫెక్షన్ మొదలైన ఒకటి రెండు వారాల తర్వాతే ఇది బయటపడుతుంది.

గులియన్ బారే సిండ్రోమ్ బాధితుల్లో ఐదుగురు కేజీహెచ్‌లోను, ఒకరు కలెక్టరేట్‌కు సమీపంలోని ఆయుష్మాన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం వీరి ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు చెప్పారు. జీబీ సిండ్రోమ్ బారిన పడిన రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించే విషయంపై వైద్యాధికారులు దృష్టి పెట్టారు. ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా రోగులు కోమాలోకి వెళ్లిపోయే ప్రమాదం ఉండడంతో ఈ రోగులకు మెరుగైన చికిత్స అందించడానికి అధికారులు ప్రత్యేకంగా వైద్యులను నియమించారు. ప్రస్తుతం కేజీహెచ్‌లో చేరిన ఐదుగురు రోగులకు డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ పి.రాధాకృష్ణ ఆధ్వర్యంలో జనరల్ మెడిసిన్ వైద్యులు వైద్య సేవలు అందిస్తున్నారు. ప్రస్తుతం వీరి ఆరోగ్యం స్థిరంగానే ఉన్నట్లు డాక్టర్ రాధాకృష్ణ తెలిపారు. ఆయుష్మాన్ ఆస్పత్రిలో ఓ రోగికి కోలుకుంటున్నాడని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు చెప్పారు. ప్రజలెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వ్యాధి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని సూచించారు.

**జీబీఎస్ అంటే ఏమిటి..?**

జీబీఎస్ అంటే గులియన్ బారే సిండ్రోమ్. ఈ గులియన్ బారే సిండ్రోమ్ అనేది ఒక రకమైన ఆటో ఇమ్యూన్ (ఒక వ్యక్తిలోని రోగనిరోధక వ్యవస్థ తనలోని ఆరోగ్య కణాలనే శత్రువులుగా భావించి దాడి చేయడం) సిండ్రోమ్. ఈ సిండ్రోమ్ బారినపడిన వ్యక్తిలో ఉన్న రోగనిరోధక వ్యవస్థ అతని నాడీ వ్యవస్థపైనే దాడి చేస్తుంది. అందుకే దీన్ని ఆటో ఇమ్యూన్ సిండ్రోమ్ అని అంటారు. ఈ సిండ్రోమ్ వల్ల బాధితుడిలోని నరాలు, కండరాలు బలహీనంగా మారుతాయి. వివిధ రకాల వైరల్, బాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్లు సోకిన వారు.. అలాంటి సమయంలో ఈ గులియన్ బారే సిండ్రోమ్ బారిన పడే ప్రమాదం ఉంది.

**త్వరగా చిన్నపిల్లలకు**

ఈ వ్యాధి చిన్నపిల్లలకు త్వరగా సోకుతుంది. చాలా పురాతనమైన వ్యాధుల్లో ఇది ఒకటి అని కేజీహెచ్ పిల్లల వార్డు విభాగాధిపతి డాక్టర్ చక్రవర్తి తెలిపారు. ప్రస్తుతం పిల్లలకు ఎవరికీ ఈ వ్యాధి సోకలేదని తెలిపారు. ఒక వేళ జీబీఎస్ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు.

## 20 నుంచి బుద్ధిమాంద్యం దివ్యాంగుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన

మాడుగుల రూరల్: బుద్ధి మాంద్యం (మెంటల్లీ రిటార్డ్) కలిగి దివ్యాంగుల పింఛన్ పొందుతున్న వారికి ఈ నెల 20వ తేదీ నుంచి 27వ తేదీ వరకు అనకాపల్లిలోని ఎన్టీఆర్ ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో అర్హత నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు స్థానిక ఎంపీడీవో కె. అప్పారావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వీరు ఆయా తేదీల్లో అనకాపల్లి ఏరియా ఆస్పత్రిలో జరిగే పరీక్షలకు హాజరయ్యేటప్పుడు విధిగా సచివాలయ సిబ్బంది అందించే నోటీసు, ఆధార్ కార్డు, సదరం ధ్రువీకరణ పత్రం, పాత వైద్య ధ్రువపత్రాలు, మందుల పుస్తకం, మందుల చీటీలు తమ వెంట తీసుకెళ్లాలని తెలిపారు. మండలంలో 240 మంది బుద్ధి మాంద్యం గల దివ్యాంగులు పింఛన్లు తీసుకుంటున్నారన్నారు. గ్రామాల వారీగా ఏ తేదీల్లో నిర్ధారణ పరీక్షలకు హాజరు కావాలన్నది తెలిపారు. సచివాలయాల వారీగా ఈ నెల 20న అవురువాడ, జి. అగ్రహారం, జాలంపల్లి, 24న జె.డి.పేట, కె.జె.పురం-1, కె.జె.పురం-2, కె.వల్లాపురం, లోవపాన్నవోలు, మాడుగుల-1, మాడుగుల-2, మాడుగుల-3, 25న ఎం. కోడూరు, ఎం. కోటపాడు, ముకుందపురం, పొంగలిపాక, పోతనపూడి, సాగరం, శంకరం, 27న సత్యవరం, తాటిపర్తి, వీరనారాయణం, ఒమ్మలి, వి.వి.అగ్రహారం, సచివాలయాల పరిధిలో గల దివ్యాంగులు హాజరు కావాలని, హాజరు కాకపోతే పింఛన్ నిలుపుదల చేస్తారని తెలిపారు.

## రైతుల వద్ద ఉన్న చెరకంతా ఫ్యాక్టరీకి సరఫరా చేయాలి

- క్రషింగ్‌లో అవాంతరాలన్నీ అధిగమించాం
- గోవాడ సుగర్స్ ఎండీ సన్యాసినాయుడు



చోడవరం: చెరకు సరఫరాలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నామని గోవాడ సుగర్ ఫ్యాక్టరీ మేనేజింగ్ డైరెక్టర్ వి.వి. సన్యాసినాయుడు తెలిపారు. స్థానిక విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడారు. గత నెల 21వ తేదీ నుంచి రెగ్యులర్ క్రషింగ్ ప్రారంభించినప్పటికీ మిల్లులో కొన్ని సమస్యలు రావడంతో క్రషింగ్‌కు కొంత మేర అంతరాయం కలిగిందన్నారు. క్రషింగ్ నిరాటంకంగా జరిగేందుకు అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. ఇప్పటి వరకూ సుమారు 33 వేల టన్నులు క్రషింగ్ జరిగిందన్నారు. 12 వేల 319 క్వింటాళ్ల పంచదార ఉత్పత్తి అయిందని అన్నారు. కో జనరేషన్ ద్వారా 58 వేల 100 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేశామన్నారు. ఇప్పటి వరకూ ఒక బాయిలర్ మీదే క్రషింగ్ జరిగిందని, శుక్రవారం నుంచి రెండో బాయిలర్ కూడా వినియోగంలోకి తెచ్చామన్నారు. రైతులకు కటింగ్ పర్మిట్లు ఇవ్వడంలో ఎటువంటి జాప్యం లేకుండా, పక్కానికి వచ్చిన చెరకుకు కటింగ్ పర్మిట్లు అడిగిన వారందరికీ ఇచ్చేలా సిబ్బందిని ఆదేశించామన్నారు. పూర్తిస్థాయిలో రైతుల వద్ద ఉన్న చెరకు అంతా ఫ్యాక్టరీకి సరఫరా చేయాలని కోరారు. నాన్ మెంబర్ల నుంచి కూడా చెరకు తీసుకుంటామని, వారు కూడా పర్మిట్లు తీసుకోవచ్చని చెప్పారు. ఈ ఏడాది 1.5 లక్షల టన్నుల క్రషింగ్ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, అందుకు రైతులంతా పూర్తిగా చెరకు సరఫరా చేసి సహకరించాలన్నారు. పేమెంట్లు కూడా తొందరగానే ఇచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు.

## విదేశీ పెట్టుబడులను నియంత్రించాలి



ఎల్ఐసీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఫెడరేషన్ నాయకులు

అనకాపల్లి: ఎల్ఐసీలో విదేశీ పెట్టుబడులను నియంత్రిస్తేనే స్వదేశీ పొదుపు విధానానికి క్షేమమని సౌత్ సెంట్రల్ జోన్ ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ వర్కింగ్ కమిటీ ప్రతినిధి పీఎస్ఎస్ సుబ్బారావు అన్నారు. స్థానిక శారదా నది రహదారి ఎల్ఐసీ కార్యాలయం వద్ద పర్మినెంట్, విశ్రాంత ఉద్యోగులు శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను వంద శాతానికి పెంచడం వల్ల భారతదేశ ఆర్థిక వ్యవస్థకు ప్రయోజనం చేకూరదని, బీమా పొందుతున్న ప్రజలకు ఎలాంటి మేలు జరగదన్నారు. విదేశీ మూలధనం మన స్వదేశీ పొదుపు మొత్తాలపై ఎక్కువ నియంత్రణ కలిగి ఉండే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఆర్థికాభివృద్ధిలో దేశీయ పొదుపు అత్యంత ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని అన్నారు. వాస్తవానికి 2024 మార్చి 31 నాటికి బీమా పరిశ్రమలో మొత్తం విదేశీ వాటా రూ.31,365.57 కోట్లు మాత్రమే ఉందని, ప్రస్తుతం ఎఫ్డీ 74 శాతం పరిమితిలో కేవలం 32.67 శాతం మాత్రమేనని ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌదరి రాజ్యసభలో ఒక ప్రశ్నకు సమాధానం ఇచ్చారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా నాయకులు మళ్ల చంద్రశేఖర్, వీఎస్‌కే హరినాథ్, జగదీశ్వరరావు, జంపా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు జాతికి గర్వకారణం సంజీవయ్య



దామోదరం సంజీవయ్య చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న అదనపు ఎస్పీ దేవప్రసాద్

అనకాపల్లి: రాష్ట్ర రెండో ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య తెలుగుజాతి గర్వించదగ్గ మహనీయుడని జిల్లా అదనపు ఎస్పీ ఎం.దేవప్రసాద్ అన్నారు. ఎస్పీ కార్యాలయంలో సంజీవయ్య జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి అదనపు ఎస్పీ శుక్రవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 38 సంవత్సరాలకు అతి పిన్నవయస్సులో ముఖ్యమంత్రి అయిన ఘనత దామోదరం సంజీవయ్యకే దక్కిందన్నారు. సంయుక్త మద్రాస్ రాష్ట్రం, ఏపీ రాష్ట్రం, కేంద్ర ప్రభుత్వంలో అనేక పదవులను నిర్వహించి దామోదరం సంజీవయ్య ప్రజా సేవలో తమదైన ముద్ర వేశారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్బీ సీఐ బాల సూర్యారావు, ఎస్ఐలు వెంకన్న, విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురైతే చర్యలు

అధికారులకు కలెక్టర్ హెచ్చరిక



మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట (విశాఖ): ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా రెవెన్యూ అధికారులు పటిష్ఠ చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే వినతులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం విశాఖ డివిజన్ రెవెన్యూ కాన్ఫరెన్స్ జరిగింది. ఫ్రీహోల్డ్ భూముల క్రమబద్ధీకరణ, ఆక్రమణల తొలగింపు, ఎన్వోసీ పత్రాల జారీ, సర్వే, మ్యుటేషన్ ప్రక్రియ, 22ఏ డీనోటిఫికేషన్, కోర్టు కేసులపై స్పందన, కుల, ఆదాయ, నివాస ధ్రువ పత్రాల జారీ తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించి.. అధికారులకు పలు అంశాలపై దిశా నిర్దేశం చేశారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ స్నేహపూర్వక వాతావరణంలో సేవలు అందించాలన్నారు. అర్జీలను తిరస్కరించినట్లయితే.. అందుకు గల కారణాలను స్పష్టంగా తెలియజేయాలన్నారు. భూముల క్రమబద్ధీకరణ విషయంపై ప్రజలకు అవగాహన కల్పించాలని, కోర్టు కేసుల విషయంలో త్వరితగతిన స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురైతే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. జేసీ కె.మయూర్ అశోక్, డీఆర్వో బీహెచ్ భవానీ శంకర్, విశాఖ ఆర్డీవో పి.శ్రీలేఖ, కలెక్టరేట్ ఏవో ఈశ్వరరావు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

### బేస్ విక్చువలింగ్ యార్డ్‌కు ప్లాటినమ్ జూబ్లీ వేడుకలు

సింధియా(విశాఖ) : భారత నావికాదళానికి 70 ఏళ్ల విశేష సేవలందించిన బేస్ విక్చువలింగ్ యార్డ్‌కు ప్లాటినమ్ జూబ్లీ వేడుకలను నిర్వహించారు. భారతనేవీ రౌండ్-ది-క్లాక్ పేరుతో బేస్ విక్చువలింగ్ యార్డ్ వద్ద ఒక స్థూపాన్ని నిర్మించారు.శుక్రవారం అధికారులు కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు.

## నాటు సారా బట్టీలపై ఎక్సైజ్ పోలీసుల దాడులు

- 20 లీటర్ల నాటు సారా స్వాధీనం
- ఇద్దరు వ్యక్తుల అరెస్టు
- అక్రమంగా నిల్వ ఉంచిన 212 బెల్లం దిమ్మలు సీజ్



నాటుసారాతో పట్టుబడిన వ్యక్తులతో చోడవరం ఎక్సైజ్ సీఐ పాపునాయుడు తదితరులు



ఎక్సైజ్ పోలీసులు సీజ్ చేసిన బెల్లం దిమ్మలు

దేవరాపల్లి: దేవరాపల్లి ఒడ్డు చింతల కల్లాలు సమీపంలో అక్రమంగా నిర్వహిస్తున్న నాటు సారా బట్టీపై చోడవరం ఎక్సైజ్ సీఐ కె.వి.పాపునాయుడు ఆధ్వర్యంలో ఎక్సైజ్ సిబ్బంది శుక్రవారం మెరుపు దాడి చేశారు. ఈ దాడిలో 20 లీటర్ల నాటు సారాతో పట్టుబడిన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. సారా తయారీకి వినియోగించే బెల్లం కొనుగోలుపై వారిద్దరూ ఇచ్చిన సమాచారంతో బెల్లం దిమ్మలు నిల్వ చేసిన గిడ్డంగిపై సైతం దాడులు నిర్వహించారు. సదరు గిడ్డంగిలో అక్రమంగా నిల్వ చేసిన 3180 కేజీలు బరువు కలిగిన (212 బెల్లం దిమ్మలు) బెల్లం దిమ్మలను స్వాధీనం చేసుకుని సీజ్ చేశామని సీఐ పాపునాయుడు తెలిపారు. ఈ దాడుల్లో నాటు సారాతో పట్టుబడిన దేవరాపల్లికి చెందిన వరదపురెడ్డి నాయుడు, పైలా నాగరాజుతో పాటు బెల్లం విక్రయిస్తున్న గుప్తాజీని అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవోదయం-2 కార్యక్రమంలో భాగంగా గురు చట్టాన్ని పటిష్టంగా అమలు చేస్తున్నామన్నారు. తమ పరిధిలో 28 గ్రామాల్లో నాటు సారా విక్రయిస్తున్నట్లు గుర్తించామన్నారు. ఆయా గ్రామాల్లో బెల్లం విక్రయదారులని గుర్తించి ముందుగా నోటీసులు ఇచ్చామన్నారు. సారా రహిత గ్రామాలుగా ప్రతి గ్రామాన్ని తీర్చిదిద్దడమే నవోదయం-2 లక్ష్యమని, దీనికి ప్రజలంతా సహరించాలని సీఐ పాపునాయుడు కోరారు. నాటు సారా బట్టీలపై నిర్వహించిన దాడుల్లో హెచ్‌సీ అప్పారావు, రాంబాబు, రామునాయుడు, కె.ఎస్. అప్పలనాయుడు, స్థానిక మహిళా సంరక్షణ కార్యదర్శి సంధ్య తదితరులు పాల్గొన్నారు.

## స్వయం సహాయక సంఘాలకు రుణాలు మంజూరు చేయాలి



మాట్లాడుతున్న జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ సత్యనారాయణ

అనకాపల్లి: పీఎం సూర్యఘర్ పథకానికి స్వయం సహాయక సంఘాలకు బ్యాంకులు రుణాలు మంజూరు చేయాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు అధికారి కె.శచీదేవి అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డు సన్ క్యాస్టల్ ఫంక్షన్ హాల్లో శుక్రవారం జిల్లాలో వివిధ బ్యాంక్ మేనేజర్లు, విద్యుత్‌శాఖ అధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలు పూర్తి చేసేందుకు యూనిట్ల ఏర్పాటుకు విరివిగా రుణాలు అందించాలన్నారు. ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ గొప్పు ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం సోలార్ ఏర్పాటు చేసుకునేందుకు ఈ పథకం ద్వారా సబ్సిడీ అందిస్తుందన్నారు. ఈ పథకం ద్వారా సోలార్ అమర్చుకున్న వినియోగదారులు పొదుపు చేసిన కరెంటు బిల్లులతో బ్యాంకు వాయిదాలు చెల్లించుకోవచ్చన్నారు. జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ కె.సత్యనారాయణ మాట్లాడుతూ బ్యాంకుల్లో రుణాలు, మంజూరుకు బ్యాంకు అధికారులకు ఏపీ ఈపీడీసీఎల్, డీఆర్‌డీఏ అధికారులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల బ్యాంక్ మేనేజర్లు, జిల్లా విద్యుత్‌శాఖ అధికారులు, డీఆర్‌డీఏ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఉపమాక మాడ వీధుల్లో సీసీ రోడ్లకు శంకుస్థాపన

రూ.25 లక్షలతో నిర్మిస్తున్న హెటిరో యాజమాన్యం



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కంపెనీ ప్రతినిధులు

నక్కపల్లి: వేంకటేశ్వర స్వామి ఆలయం ఉన్న ఉపమాక మాడ వీధుల్లో హెటిరో కంపెనీ యాజమాన్యం సీసీ రోడ్డు నిర్మిస్తోంది. సుమారు రూ.25 లక్షలతో నిర్మించే ఈ రోడ్డు పనులను శుక్రవారం కంపెనీ డీజీఎంలు కుళ్లాయిరెడ్డి, సుబ్బారెడ్డి, రాజారెడ్డి కొబ్బరి కాయ కొట్టి ప్రారంభించారు. ప్రతి ఏటా విశేష పర్వదినాలు, మార్చిలో జరిగే కల్యాణోత్సవాలు, ధనుర్మాస అధ్యయనోత్సవాలు, బ్రహ్మోత్సవాల్లో స్వామివారి రథోత్సవం నిర్వహిస్తారు. పెద్ద రథం తిరగడానికి మాడ వీధుల్లో ప్రస్తుతం ఉన్న రోడ్లు అనుకూలంగా లేవు. రోడ్లను ఆక్రమించి చాలా మంది మెట్లు, అరుగులు నిర్మించేయడంతో రోడ్డు కుదించుకుపోయింది. రథం వెళ్లి రావడానికి అవసరమైన మాడవీధుల్లో సీసీ రోడ్లు నిర్మించాలని స్థానికులు, హోంమంత్రి అనిత ద్వారా హెటిరో యాజమాన్యాన్ని కోరడంతో చైర్మన్, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ బండి పార్థసారథిరెడ్డి మాడవీధుల్లో రూ.25 లక్షలతో సీసీ రోడ్లు నిర్మించేందుకు అంగీకరించారు. శుక్రవారం వీటి పనులు ప్రారంభించారు. వారం రోజుల్లో పూర్తి చేసి కల్యాణోత్సవాల నాటికి అందుబాటులోకి తీసుకు వస్తామని కంపెనీ ప్రతినిధులు కుళ్లాయిరెడ్డి, సుబ్బారెడ్డి తెలిపారు. దేవస్థానం మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి, ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## రైల్వేస్టేషన్‌లో వృద్ధుడి మృతి



రైల్వేస్టేషన్‌లో అనారోగ్యంతో మృతి చెందిన అడవిరాజు

తుని: స్థానిక రైల్వేస్టేషన్‌లో అనారోగ్యంతో అడవిరాజు (70) మృతి చెందాడని తుని జీఆర్పీ ఎస్సై జి.శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం రైల్వేస్టేషన్ బుకింగ్ కౌంటర్ సమీపంలో మృతదేహాన్ని గుర్తించిన స్టేషన్ మేనేజరు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతుడి వద్ద లభించిన ఆధారాల ప్రకారం అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం పెదతీనార్ల గ్రామానికి చెందిన అడవిరాజుగా గుర్తించారు. మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి మృతదేహాన్ని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచినట్టు ఎస్సై తెలిపారు.

## ఆర్టీసీ డ్రైవర్లపై గురుతర బాధ్యత

- విశాఖ పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ



ఉత్తమ డ్రైవర్లకు అవార్డులు అందిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

మద్దిలపాలెం (విశాఖ): ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు సురక్షితంగా చేర్చాల్సిన గురుతర బాధ్యత ఆర్టీసీ డ్రైవర్లపై ఉందని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ అన్నారు. రహదారి భద్రతా మాసోత్సవాల ముగింపు సభ శుక్రవారం మద్దిలపాలెం డిపోలో జరిగింది. ఈ కార్యక్రమానికి సీపీ ముఖ్య అతిథిగా పాల్గొని ఉత్తమ డ్రైవర్లకు అవార్డులు, ప్రశంసాపత్రాలు ప్రదానం చేశారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఆర్టీసీ డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ బస్సులను సురక్షితంగా నడపాలని సూచించారు. బస్ బేలో పూర్తిగా ఎడమ వైపు మాత్రమే బస్సులు నిలిపి, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ప్రయాణికులను అనుమతించాలన్నారు. అవసరమైతేనే హారన్ మోగించాలని, డ్రైవర్లు తప్పనిసరిగా మానసికంగా, శారీరకంగా ఆరోగ్యవంతులుగా ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. గతంలో కంటే ఆర్టీసీ వల్ల జరిగే ప్రమాదాల సంఖ్య తగ్గుముఖం పట్టిందని వెల్లడించారు. డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఆర్.సి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆర్టీసీ డ్రైవర్లకు సరైన శిక్షణ, డ్రైవింగ్‌లో మెళకువలు పాటించడం వల్ల ప్రమాదాల సంఖ్య తగ్గుతోందన్నారు. సాంకేతికతకు అనుగుణంగా డ్రైవింగ్ నైపుణ్యాలు పెంపొందించుకోవాలని సూచించారు. ఏయూ ప్రొఫెసర్, డీసీఎంఎస్ బి.మోహన్ వెంకట్ రామ్ మాట్లాడుతూ డ్రైవర్లు, వారి కుటుంబ సభ్యులకు తగిన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు ప్రమాదాలు జరగకుండా డ్రైవర్లకు ఎప్పటికప్పుడు శిక్షణ ఇస్తూ దిశానిర్దేశం చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో జీరో యాక్సిడెంట్ సాధించిన గాజువాక డిపో మేనేజర్‌కు అవార్డు ప్రదానం చేశారు. పలువురు డ్రైవర్లు, మెకానిక్ సిబ్బంది, సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్లకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు.

## క్లుప్తంగా

### 26న అఖండ దీపారాధన

అనకాపల్లి టౌన్: స్థానిక లక్ష్మీదేవిపేట ఆది శివ లింగాలయంలో మహా శివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ సాధు పరిషత్ ఉపాధ్యక్షుడు సద్గురు రాజర్షి ఆత్మానంద స్వామి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26న మహా శివరాత్రి సందర్భంగా ఆలయంలో 11 అడుగుల శివలింగానికి అఖండ దీపారాధన, సాయంత్రం 108 నక్షత్రమాల దీపజ్యోతులు వెలిగించడం, కోలాట బృందాలచే సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ద్వాదశ శివలింగాలకు ప్రత్యేక పూజలు, అనంతరం మహారుద్రాభిషేకం, ఆధ్యాత్మిక గురువులచే గీతా ప్రవచనాలు, భజన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.

### రేపు సంకటహర చతుర్థ వ్రతం

అనకాపల్లి: జీవీఎంసీ విలీన గ్రామమైన సిరసపల్లి చింతామణి గణపతి దత్తక్షేత్రంలో ఈ నెల 16న సంకటహర చతుర్థ పూజలు, హోమాలు, అభిషేకాలు నిర్వహిస్తున్నట్లు దత్తక్షేత్రం నిర్వాహకుడు అంజనేయరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయంలో దత్త లైలాభిషేకాలు, సహస్ర దూర్వార్చన, గణపతి హోమం, సంకటహర గణపతి వ్రతంలో పాల్గొనే భక్తులు ముందుగా ఆలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

### ఇద్దరు జూదరులపై కేసు నమోదు

అనకాపల్లి: మండలంలో గోపాలపురం గ్రామం శివారులో జూదమాడుతున్న ఇద్దరిని అదుపులోనికి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.1820 స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్‌ఐ రవికుమార్ శుక్రవారం తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు దాడి చేశామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

### అక్రమంగా తవ్విన చెరువును పూడ్చాలని ఆందోళన



సచివాలయం వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

పరవాడ: ఫార్మా వ్యర్థజలాలను నిల్వ చేయడానికి తానాం వద్ద ప్రైవేట్ స్థలంలో అక్రమంగా తవ్విన చెరువును తక్షణమే మూసివేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. తానాం గ్రామ సచివాలయం వద్ద రైతులతో కలిసి శుక్రవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మా వ్యర్థ రసాయనాలను నిల్వ చేసేందుకు తవ్విన చెరువుపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌కు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా తవ్విన చెరువును వెంటనే మూసివేయాలని రాష్ట్ర పీసీబీ అధికారులు ఆదేశాలు జారీ చేశారని తెలిపారు ఫార్మా వ్యర్థాలతో పూడ్చి వేస్తున్న వర్రి వారి చెరువుకు ఇప్పటి వరకు నష్ట పరిహారం చెల్లించలేదన్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఫార్మా యాజమాన్యాలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సచివాలయ సిబ్బందికి అందించారు. వర్రి సన్యాసినాయుడు, కన్నంనాయుడు, వెంకునాయుడు, సన్యాసమ్మ పాల్గొన్నారు.

### బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శుక్రవారం 6,773 దిమ్మలు వచ్చాయి.

| దిమ్మల రకం | కనిష్ట ధర | గరిష్ట ధర |
|---|---|---|
| స్పెషల్ రకం | 3,800 | 4,650 |
| మొదటి రకం | 3,580 | 4.260 |
| రెండో రకం | 3,200 | 3,720 |
| మూడోరకం | 2,870 | 3,240 |

### అనకాపల్లి సినిమాలు

| | |
|---|---|
| ఇట్స్ కాంప్లికెటెడ్ | :రాజా |
| ఆరెంజ్ | :సత్యనారాయణ స్క్రీన్-1(ఉదయం) |
| పుష్ప-2 | : సత్యనారాయణ స్క్రీన్-1(మ్యాట్నీ, 1,2 షోలు) |
| కెప్టెన్ అమెరికాతెలుగు వెర్షన్ | :సత్యనారాయణ స్క్రీన్-2 |
| తండేల్ | :పర్తిసాయి |
| సంక్రాంతికి వస్తున్నాం | :షిర్డీసాయి |
| సూర్య కృష్ణన్ | :వెంకటేశ్వర(ఉదయం) |
| తల | :వెంకటేశ్వర (మ్యాట్నీ, 1,2 షోలు) |
| లైలా | :శ్రీసత్య |
| బ్రహ్మానందం | :రామచంద్ర |

### రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 49 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-3 యూనిట్లు , బీ పాజిటివ్-10 యూనిట్లు, ఓ పాజిటివ్-33 యూనిట్లు, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరులో సంప్రదించవచ్చు.

### గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 410 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 367 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

# శంకరం.. కలవరం

- గ్రామం వద్ద ప్రమాదకరంగా జాతీయ రహదారి
- రెండు వంతెనల మధ్య మృత్యు మలుపు
- అదుపు తప్పితే మరణమే
- రాకపోకల సమయంలో వాహనదారుల బెంబేలు


గతేడాది ప్రమాదానికి గురై నుజ్జయిన కారు (ఫైల్)


ఇటీవల శంకరం మలుపు వద్ద జరిగిన ప్రమాదం (ఫైల్)


రోడ్డు క్రాస్ చేస్తున్న ద్విచక్ర వాహనదారులు

తుమ్మపాల: వేగంగాను, సులభంగాను గమ్యానికి చేరుకునేందుకు నిర్మించిన జాతీయ రహదారి కొన్ని ప్రాంతాలకు మృత్యు మార్గంగా మారింది. రెప్పపాటులో చూస్తూనే పలువురు ప్రమాదాల బారిన పడి మృత్యువాత పడుతున్న ఘటనలు నిత్యకృత్యంగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో జాతీయ రహదారిపై ప్రయాణించాలంటే ద్విచక్ర వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు. మరోవైపు రోడ్డు క్రాసింగ్‌లకు సరైన సౌకర్యాలు లేకపోవడంతో ప్రమాదమని తెలిసినా ప్రజలు దూరాన్ని అధిగమించేందుకు జాతీయ రహదారిపై డివైడర్లు దాటుకుని క్రాస్ చేస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు.

మండలంలో శంకరం వద్ద జాతీయ రహదారి మలుపు ప్రమాదాలకు నిలయంగా మారింది. ముందు నుంచే ప్రమాదాలకు నిలయంగా ఉన్న శంకరం రహదారి మలుపు ఆరు లైన్ల జాతీయ రహదారి నిర్మాణం తర్వాత మరింత ఎక్కువయ్యాయి. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా ఆధునికీకరణ నేపథ్యంలో బ్రిడ్జిల నిర్మాణం జరిగింది. శంకరం మలుపుకు అటు సబ్బవరం వైపు వంతెన, ఇటు అనకాపల్లి పులి కాలువ **వంతెనలు పెను శాపాలుగా మారాయి. వంతెనల** మీదుగా వేగంగా వస్తున్న వాహనాలను గమనించే పరిస్థితులు చాలా తక్కువగానే ఉంటున్నాయి. వేగంగా వస్తున్న వాహనాలు మలుపు వద్ద కంట్రోల్ చేయలేకనే అదుపు తప్పి ప్రమాదాలు జరుగుతున్నాయి. గతేడాది సింహాచలం దర్శించుకుని అన్నవరం వెళ్తున్న కారు అదుపు తప్పి బోల్తాపడి కుటుంబం ఛిద్రమైపోయింది. ఇటీవల ద్విచక్ర వాహనదారుడు ముందుగా ఆగి ఉన్న వాహనాన్ని ఢీకొట్టి ప్రాణాలు వదిలాడు. గతంలో కారులోంచి ఎగిరి రోడ్డుపై పడి మృత్యువాత పడిన ఘటనలు కోకొల్లలు.

**అపరిమిత వేగానికి గ్రీన్ సిగ్నల్...**

అనకాపల్లి - ఆనందపురం 40 కిలోమీటర్ల జాతీయ రహదారిపై గరిష్టంగా 120 కిలోమీటర్ల వరకు వేగంగా ప్రయణించవచ్చని రోడ్డు కాంట్రాక్టర్ గతంలో ప్రకటించారు. దీనికి తగ్గట్టే శంకరం వద్ద రెండు వంతెనలు ఉండటంతో వాహనాలు వేగం మరింతగా కొనసాగుతోంది. ఈ క్రమంలో శంకరం వద్ద మలుపు అదుపు చేయడం మరింత కష్టంగా మారింది. **దీంతో రోడ్డుకు కుడి, ఎడమ మార్గాల మీదుగా వస్తున్న వాహనాలు** ముఖ్యంగా కార్లు నడుపుతున్న వారు అదుపు చేయలేక ప్రమాదాల బారిన పడుతున్నారు. వారితో పాటు కుటుంబ సభ్యుల ప్రాణాలను పెను ప్రమాదం బారిన పడేస్తున్నారు. జాతీయ రహదారి అభివృద్ధి తర్వాత అక్కడ జరిగిన ప్రమాదాలన్నీ ఇలాంటి కొవకు వచ్చినవే ఎక్కువగా ఉన్నాయి.

**ప్రమాదకరమైన రోడ్డు క్రాసింగ్...**

ఒక పక్క ప్రమాదాలకు కేరాఫ్‌గా నిలుస్తున్న శంకరం మలుపుకు అతి దగ్గరలోనే పులి కాలువ వంతెన దిగువన నిత్యం అధిక సంఖ్యలో జనాలు రోడ్డు క్రాస్ చేస్తున్నారు. సాయంత్రం వేళల్లో అధిక సంఖ్యలో విద్యార్థులు రోడ్డు క్రాస్ చేసి రావడంతో పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వంతెనకు రోడ్డు డివైడర్లకు అనుసంధానం వద్ద చిన్నపాటి గేప్ రావడంతో అక్కడ నుంచి ద్విచక్ర వాహనాలు రోడ్డును క్రాస్ చేస్తున్నాయి. దీంతో వేగంగా వస్తున్న లారీలు ఒక్కసారిగా సడన్ బ్రేకులు వేస్తున్నారు. పలు ప్రమాదాలు కూడా జరిగాయి. దగ్గరలోని రాయుడుపేట, బట్లపూడి గ్రామాల ప్రజ**లతో పాటు కలెక్టరేట్‌కు వచ్చే** ఉద్యోగులు, ప్రజలు **ఇక్కడ రోడ్డు క్రాస్ చేయకుండా** అధికారులు అవగా**హన చేయాల్సిన అవసరం ఉ**ంది.

### ప్రమాదాలు జరగకుండా చూడాలి....



**శంకరం వద్ద మలుపు** అనేక ప్రమాదాలకు కారణంగా ఉంది. ఇక్కడ ప్రమాదం జరిగితే మరణమే. తీవ్రమైన ప్రమాదాలు జరుగుతున్నాయి. జాతీయ రహదారి నిర్మాణం తర్వాత అదే చోట ప్రమాదాలు చాలా బాధాకరం. మహిళలు, చిన్నారులు మృత్యువాత పడుతున్న ఘటనలు చూసి చాలా భయాందోళనలకు గురవుతున్నాం. అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని అందరికీ అవగాహన చేయాలి.

-పి.శేఖర్, శంకరం గ్రామం

### మలుపు వద్ద వాహనాల పార్కింగ్ వద్దు



అత్యంత ప్రమాదకరమైన శంకరం మలుపు వద్ద నిత్యం భారీ వాహనాలు రోడ్డుపైనే పార్కింగ్ చేసి ఉంటున్నాయి. వాటిని పోలీసులు కట్టడి చేయాలని కోరుతున్నాం. సబ్బవరం మీదుగా వస్తున్న వాహనాలు మలుపు వద్ద జాతీయ రహదారిపై నిలిపి సమీప టీ స్టాల్‌కు వెళ్లడంతో ద్విచక్ర వాహనదారులు మృతి చెందుతున్నారు.

– సి.మోహన్, గురజాడ నగర్, రేబాక గ్రామం

### ఐడీబీఐ బ్యాంక్ బీరువాల వితరణ


ఉపాధ్యాయులకు బీరువాలను అందజేస్తున్న బ్యాంక్ అధికారులు

అనకాపల్లి టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు ఐడీబీఐ బ్యాంక్ శాఖ రూ.1.25 లక్షల విలువైన ఆరు గోద్రెజ్ బీరువాలను వితరణగా అందజేసింది. జీవీఎంసీ పరిధిలోని గవరపాలెం చిన్న హైస్కూల్, మెయిన్ రోడ్ పెద్ద హైస్కూల్, టౌన్ గరల్స్ హైస్కూల్, గంగిరేవు చెట్టు వద్ద గరల్స్ హైస్కూల్‌కు సీఎస్ఆర్ నిధులలో భాగంగా ఐడీబీఐ బ్యాంక్ వీటిని అందజేసింది. శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు బ్యాంక్ డిప్యూటీ జనరల్ మేనేజర్ కిరణ్ ఫ్రాన్సిస్ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఐడీబీఐ బ్యాంక్ సపోర్టింగ్ ఎడ్యుకేషన్ ఫర్ ఎంపవర్‌మెంట్ అండ్ డెవలప్‌మెంట్ (సీడ్) కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. అందులో భాగంగా రూ.30 కోట్లతో రెండు వేల బ్రాంచ్‌లలో ఇటువంటి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఐడీబీఐ బ్రాంచ్ మేనేజర్ డి. గంగాధరరావు, గవరపాలెం హైస్కూల్ హెచ్‌ఎం సూర్యనారాయణ, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

### 'మున్సిపాలిటీలో అక్రమాలపై విచారణ జరపాలి'

నర్సీపట్నం: మున్సిపాలిటీలో జరుగుతున్న అక్రమాలపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని జైభీమ్ రావ్ భారత్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నేతల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో డ్రైవింగ్ రాని 13 మందికి డ్రైవర్లుగా జీతాలు చెల్లిస్తున్నారని, వీరిలో ఇద్దరే డ్రైవర్లు అని తెలిపారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు, అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## వేగవంతంగా ఈ-పంట నమోదు


తేగాడలో పంట నమోదును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి మోహనరావు


పేరంటాలపాలెంలో ఈ-పంట నమోదు పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి

కశింకోట: రైతులు తమ భూముల్లో పండించే పంటలను ఈ-పంటలో నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి బి. మోహనరావు కోరారు. మండలంలోని తేగాడ, పేరంటాలపాలెం గ్రామాల్లో శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఈ-పంట నమోదు కార్యక్రమ అమలు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూ ఆధార్ కార్డుల కోసం రైతులు ఫార్మర్ రిజిస్ట్రీ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఇందుకు ఈ నెల 25 వరకు గడువు ఉందన్నారు. దీనివల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే పథకాల ద్వారా లబ్ధి పొందుతారని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎం. స్వప్న, సహాయకులు పాల్గొన్నారు.

### దామోదరం సంజీవయ్యకు ఘన నివాళి


సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న రిజిస్ట్రార్ విశ్వచంద్రనాథ్ తదితరులు

సబ్బవరం: దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో దామోదరం సంజీవయ్య 104వ జయంతి ఉత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ డాక్టర్ విశ్వచంద్రనాథ్ మదాసు, సీనియర్ అధ్యాపకులు ఎ.నాగేశ్వరరావు, డాక్టర్ దయానందమూర్తిలతో కలిసి దామోదరం సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బందితో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## నిరుపయోగంగా సోలార్ లైట్, స్తంభం


రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసిన సోలార్ లైట్లు


బయ్యవరంలో నేలకొరిగి నిరుపయోగంగా సోలార్ లైట్, స్తంభం

కశింకోట: మండలంలోని బయ్యవరంలో సోలార్ లైట్ స్తంభం విరిగి పడి రెండు నెలలవుతున్నా జాతీయ రహదారి అథారిటీ అధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. గతేడాది జూన్‌లో బయ్యవరం వద్ద జాతీయ రహదారిని ఆనుకొని రెండు వైపులా రూ.25 లక్షలు వెచ్చించి జాతీయ రహదారి అథారిటీ అధికారులు 20 సోలార్ విద్యుత్ స్తంభాలు, లైట్లు, సోలార్ ప్యానళ్లను ఏర్పాటు చేశారు. వీటిని రోడ్డుకు ఇరువైపులా వెలుగు కోసం అమర్చారు. ఇవి చీకటి వేళ వెలుగులను విరజిమ్ముతూ ప్రజలు, వాహన చోదకులకు సౌకర్యవంతంగా ఉన్నాయి. వీటిలో యలమంచిలి-అనకాపల్లి మార్గంలో బయ్యవరం కూడలి వద్ద ఒక సోలార్ లైట్ స్తంభం విరిగి నేలకొరిగింది. ఇది జరిగి రెండు నెలలవుతున్నా దీని అతీగతీ గురించి అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయమని స్థానికులు విమర్శిస్తున్నారు. దీనివల్ల అది పనికి రాకుండా పోయే అవకాశం ఉన్నందున సత్వరమే మరమ్మతులు చేపట్టి పునరుద్ధరించడానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని నిరసన


జీవీఎంసీ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న బల్లా నాగభూషణం

అనకాపల్లి టౌన్: పట్టణంలో అస్తవ్యస్తంగా ఉన్న ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు బల్లా నాగభూషణం కోరారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా శుక్రవారం స్థానిక జీవీఎంసీ కార్యాలయం వద్ద నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో ఎ.ఓ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. నాగభూషణం మాట్లాడుతూ ముఖ్యంగా ఫుట్‌పాత్‌ల ఆక్రమణ, వాణిజ్య సముదాయాల సెల్లార్లలో వ్యాపారాలు, రోడ్లు ఆక్రమించి తోపుడు బండ్ల వ్యాపారాలు, సమయపాలన లేకుండా హెవీ వెహికల్స్ ద్వారా లోడింగ్, అన్ లోడింగ్ చేస్తున్నారని ఆరోపించారు. వీటి వల్ల ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో మల్లేశ్వరావు, జిల్లా వికలాంగుల పోరాట సమితి అధ్యక్షుడు బుగిడి నూక, అసోసియేషన్ కార్యదర్శి వినకోట నీలేష్ గుప్తా, సహాయ కార్యదర్శి రొబ్బి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## పీసా కమిటీ సభ్యులకు శిక్షణ తరగతులు

నాతవరం: గిరిజనులకు అన్ని విధాలుగా మేలు చేసేందుకు పీసా చట్టం ఎంతో దోహదపడుతుందని ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నూతనంగా ఎన్నికైన పీసా కమిటీసభ్యులకు శిక్షణ తరగతులు నిర్వహించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నిబంధనల ప్రకారం అమలు చేయాలంటే పీసా కమిటీ సభ్యులకు కనీస అవగాహన ఉండాలన్నారు. శిక్షణ తరగతుల్లో చెప్పిన అంశాలను పీసా కమిటీ సభ్యులు క్షేత్రస్థాయిలో అమలు చేసేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేయాలన్నారు. అధికారులు నిబంధనలు పాటించకుండా మొక్కుబడి కార్యక్రమాలు చేస్తారని, వాటిని పీసా కమిటీ సభ్యులు ప్రశ్నించి అడ్డుకోవాలన్నారు.

ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె.ఉషశ్రీ, కార్యాలయ సూపరింటెండెంట్ పోలుపర్తి పార్థసారథి, పంచాయతీ విస్తరణాధికారి ఎస్.ఎస్.మూర్తి, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## పోస్టల్ ఉద్యోగుల నిరసన

అనకాపల్లి టౌన్: కేంద్ర ప్రభుత్వం దొడ్డి దారిలో పోస్టల్ డిపార్టుమెంట్‌లో మునుపటి మెకన్సీ కన్సల్టెన్సీ సిఫార్సులు, టీఎస్ఆర్ సుబ్రహ్మణ్యం టాస్క్ ఫోర్స్ కమిటీ నివేదికలను అమలు చేయు ప్రయత్నాలను తక్షణమే విరమించుకోవాలని ఎన్ఎఫ్‌పీఈ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక పోస్టాఫీస్ కార్యాలయ ఆవరణలో ఉద్యోగులు జేఏసీగా ఏర్పడి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ కమిటీ నివేదికలను అమలు చేయడానికి వేగంగా చర్యలు చేపడుతున్నారని, తద్వారా పోస్టల్ డిపార్ట్‌మెంట్ కేంద్ర ప్రభుత్వ సంస్థగా కొనసాగడమనేది ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్‌పీఈ నాయకులు సి. శంకరరావు, కె. చిరంజీవి, పి. ప్రసన్నకుమార్, ఇ. అప్పారావు, నూకరాజు దొర తదితరులు పాల్గొన్నారు.

## గురుకులంలో ముగిసిన వర్క్ షాపు


అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో ప్రదర్శించిన ప్రాజెక్టులను పరిశీలిస్తున్న విద్యార్థులు


ప్రాజెక్టు గురించి వివరిస్తున్న విద్యార్థులు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులు తయారు చేసి ప్రదర్శించిన ప్రాజెక్టులు ఆహూతులను ఆకట్టుకున్నాయి. రెండు రోజుల పాటు పాఠశాలలోని అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో నిర్వహించిన వర్క్ షాపు శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జి. గ్రేస్, ల్యాబ్ ఇన్‌చార్జి కె. అపర్ణల ఆధ్వర్యంలో విద్యార్థులు స్మార్టు డాం మేనేజ్‌మెంట్, హెల్త్ గార్డు, అగ్రబాట్ వంటి ప్రాజెక్టులు తయారు చేశారు. వీటిని హైస్కూలు, గాయత్రి స్కూళ్ల విద్యార్థులు వచ్చి ఆసక్తిగా పరిశీలించారు. ప్రాజెక్టులపై ఉన్న అనుమానాలను విద్యార్థులకు ఉపాధ్యాయులు నివృత్తి చేశారు.

## ఆక్రమణలు తొలగిస్తుంటే..

# కూటమి నేతలకు కోపమొచ్చింది

- ఆక్రమణలను తొలగించేందుకు వెళ్లిన అధికారులు
- ప్రజాప్రతినిధుల ఒత్తిడితో తూతూ మంత్రంగా చర్యలు
- తొలగింపుల్ని అడ్డుకున్న కూటమి 'ముఖ్యనేతలు'


కార్మికనగర్‌లో ఆక్రమణలను తొలగించే సమయంలో కూటమి నాయకుల బెదిరింపులతో ఆగిన అధికారులు


చీమలాపల్లిలో షెడ్ తొలగించేందుకు వెళ్లిన అధికారులను అడ్డుకున్న దృశ్యం

పెందుర్తి: అది చెరువు.. మరొకటి ప్రభుత్వ భూమి.. అందులో ఇష్టానుసారంగా కూటమి నాయకులు స్థలాలను ఆక్రమించి అమ్మకాలు జరుపుతున్నారు. ఆ దురాక్రమణ పర్వాన్ని అడ్డుకునేందుకు అధికారులు కదిలారు. కానీ వారికి 'కూటమి ముఖ్యనేతలు' బంధనాలు వేశారు. ఆ ఆక్రమణలను తొలగిస్తే మీ సంగతి చూస్తామంటూ.. అధికారులనే అడ్డుకున్నారు.

**కదిలి.. వెనక్కి మళ్లిన యంత్రాంగం**

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత పెందుర్తి పట్టణ ప్రాంతంలో ప్రభుత్వ భూముల ఆక్రమణలు పెరిగిపోయాయి. చెరువులు, గెడ్డలు, ప్రభుత్వ స్థలాల్లో కూటమి నాయకులు కబ్జాలకు పాల్పడుతూ.. ఆయా స్థలాలను పేద, మధ్య తరగతి కుటుంబాలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. దీనిపై 'పాకవెయ్..అమ్మేసెయ్' శీర్షికన సాక్షి కథనాన్ని ప్రచురించింది. ఈ కథనంపై స్పందించిన తహసీల్దార్ ఎం.ఆనంద్ కుమార్ ఆదేశాలతో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ దివ్య బృందం ఆక్రమణల తొలగింపునకు వెళ్లింది. కార్మికనగర్‌లో అక్రమంగా వేసిన పాకలను తొలగించారు. అయితే మిగిలిన చోట కొందరు ప్రజాప్రతినిధులు ఒత్తిడి చేయడంతో వెనుదిరిగినట్లు తీవ్రస్థాయిలో ఆరోపణలు వచ్చాయి.

**కంచే చేను మేస్తే..**

పెందుర్తి పట్టణ ప్రాంతంలో చెరువులు, ప్రభుత్వ భూములను 'కంచే చేను మేస్తున్న' చందంగా కూటమి నాయకులే మింగేస్తున్నారు. ఆక్రమణలను తొలగించేందుకు వెళుతున్న అధికారులను బెదిరిస్తూ భూకబ్జాదారులకు అండగా నిలుస్తున్నారు. శుక్రవారం ఆక్రమణలను తొలగించేందుకు వెళ్లిన అధికారులకు చుక్కెదురైంది. చినముషిడివాడ కార్మికనగర్, చీమలాపల్లిలోని చెరువు, ప్రభుత్వ భూముల్లో వెలసిన అక్రమ నిర్మాణాలను తొలగించేందుకు వెళ్లిన రెవెన్యూ అధికారులను కూటమి నాయకులు అడ్డుకున్నారు. ముఖ్యంగా స్థానిక జనసేన, టీడీపీ నాయకులు వారి ముఖ్య నేతలతో ఫోన్లు చేయించి మరీ, తొలగింపుల్ని నిలిపేయించారు. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షకులుగా పదే పదే చెప్పుకునే ప్రజాప్రతినిధులే ప్రభుత్వ భూముల ఆక్రమణలను ప్రోత్సహిస్తుంటే చేసేదేం లేక రెవెన్యూ అధికారులు వెనుదిరిగాల్సి వచ్చింది.

## బెల్టు షాపులు అరికట్టాలని డిమాండ్

దేవరాపల్లి: గ్రామాల్లో మద్యం బెల్టు షాపులను అరికట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి. వెంకన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు దేవరాపల్లిలో శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. గ్రామాల్లో బెల్టు షాపులు పెట్టబోమని, పెడితే తాట తీసి పీడీ యాక్టు అమలు చేయాలంటూ స్వయాన ముఖ్యమంత్రి ప్రకటన చేసినా ఎక్కడా అమలు కావడం లేదన్నారు. జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో ప్రతీ టీ దుకాణం, పాన్‌షాపులు, డాబాల్లో విచ్చల విడిగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయన్నారు. తక్కువ ధరకు మద్యం విక్రయిస్తామని గొప్పలు చెప్పిన ప్రభుత్వం తాజాగా 15 శాతం ధరలు పెంచి రూ. 150 కోట్ల మేర మందుబాబుల నుంచి వసూలు చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 20 ఫోక్సో కేసులు నమోదు కావడం ఇందుకు నిదర్శనమన్నారు. గత నెల 27న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా తీరు మారలేదన్నారు. హోం మంత్రి సొంత జిల్లాలో మైనర్ బాలికలు, మహిళలపై అత్యాచారాలు జరుగుతున్నా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో మద్యం బెల్టు షాపులపై ఉక్కుపాదం మోపాలని డిమాండ్ చేశారు.